క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ప్రచారం



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ గదబపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు గ్రామంలోని పిల్లల ఇంటికి ఆదివారం వెళ్లి ప్రచారం చేశారు. నాణ్యమైన విద్యను అందించే సర్కార్ బడుల వైపే మొగ్గుచూపాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బోధన, మౌలిక సదుపాయలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్, ఏపీటీఎఫ్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మక్క గంగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ లా సెట్‌కు విశేష స్పందన



మోడల్ లా సెట్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వెనుకబడిన తరగతులు న్యాయవాదుల అసోసియేషన్ జిల్లా శాఖ అధ్వర్యంలో ఆదివారం ఎంపీఆర్ న్యాయ కళాశాలలో నిర్వహించిన మోడల్ లా సెట్ పరీక్షకు అధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు. ఈ మోడల్ టెస్ట్‌ను గత ఐదేళ్లుగా ప్రతి ఏటా లాసెట్ పరీక్షకు ముందుగా బీసీ న్యాయవాదులు నిర్వహిస్తున్నారు. లా సెట్ పరీక్షను బీసీ న్యాయవాదుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఎంపీఆర్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ కె.మోసే తదితరులు పర్యవేక్షించారు.

ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో గ్రామస్తులు

లావేరు: కొండకుంకాం పంచాయతీ పరిధి ఇజ్జుపేట గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహం ఏర్పాటు కోసం ఆదివారం కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టరు లుకలాపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, ఉప సర్పంచ్ బొబ్బాది గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సంతాపం



వరహాలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ తదితరులు

లావేరు: మండల ఉపాధ్యక్షుడు లుకలాపు శ్రీనివాసరావు తల్లి వరహాలమ్మ ఇటీవల మృతి చెందారు. పెదలింగాలవలస గ్రామంలో ఆమె సంతాప సభ ఆదివారం నిర్వహించగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. వరహాలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, ఎచ్చెర్ల మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



పరామర్శలో సాయికుమార్ తదితరులు

జి.సిగడాం: జాడ గ్రామానికి చెందిన పంచోతుల సత్యవతి రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆమెను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, ఎంపీటీసీ సభ్యుడు పెద్ది శ్రీనివాసరావు, సర్పంచ్ బాణాన సూర్యనారాయణ, చిక్కాల ధర్మారావు తదితరులు ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



ఎచ్చెర్ల క్యాంపస్: అజ్జరాంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



జి.సిగడాం: మెట్టవలసలో పంచముఖేశ్వర ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



రణస్థలం:రామతీర్థాలు కూడలిలోని వీరాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న సాయికుమార్

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



గార: గార ఆలయంలో పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఊరూరా ఘనంగా జరిగాయి. తెల్లవారు జామునుంచే ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తమలపాకులు, నిమ్మకాయలతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఎచ్చెర్ల మండలంలోని అజ్జరాం, ఫరీదుపేట, కొయ్యాం, సంతసీతారాంపురం, అరిణాంఅక్కివలస, కుశాలపురం, చిలకపాలెం గ్రామాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

రణస్థలం: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలిలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జె.ఆర్.పురం, బంటుపల్లి గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం వైస్ సర్పంచ్ దన్నాన సీతారాం, వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, టీకి బ్రహ్మాజీ, మహంతి సత్యనారయణ, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

లావేరు: లావేరు, బొంతుపేట, కేశవరాయునిపాలెం, వెంకటాపురం, లావేటిపాలెం, మురపాక, సుభద్రాపురం,బుడుమూరు, మురపాక, అదపాక, పాతకుంకాం, కొత్తకుంకాం, గుర్రాలపాలేం, బెజ్జిపురం, ఇజ్జాడపాలెం, తామాడ, కొత్తకోట తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. తమలపాకులు, నిమ్మకాయలతో పాటు పసుపు, కుంకమలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లావేరులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద కమిటీ సభ్యులు సుమారు ఐదువేల మందికి అన్నదానం చేశారు. పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలు పార్టీల నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు.



లావేరు: అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

జి.సిగడాం: మెట్టవలస, పెంట, వాండ్రంగి, పాలఖండ్యాం, గేదెలపేట, చెట్టుపొదిలాం, నాగులవలస, చీడిపేట తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. ఎందువ, నాగులవలస, లింగాపురం, గెడ్డకంచరాం, మద్రివలస, పాలఖండ్యాం,గేదెలపేట, సీతంపేట, నక్కపేట, పెంట, జాడ, వాండ్రంగి గ్రామాల్లో అన్నదానం చేశారు.

అభయాంజనేయునికి పూజలు

గార: హనుమజ్జయంతి పురస్కరించుకుని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీకూర్మనాథుని ఉపాలయమైన స్వయంభువు తండ్యాలపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, సింధూర అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ జరిగింది. గ్రామస్తుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. గార గ్రామంలో వంశధార నదీతీరాన ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. సెగిడిపేట, జొన్నలపాడు కాలనీ, దీపావళి జంక్షన్, రామకృష్ణాపురం, కొర్ని, బందరువానిపేట, కళింగపట్నం, శ్రీకూర్మం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయల్లో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

శ్రీకాకుళం అర్బన్: హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని పలుచోట్ల హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొండేటివీధిలోని షిర్డీ సాయి ఆలయ ప్రాంగణంలో హనుమాన్ జయంతి వేడుకలు చేపట్టారు. 11 గంటల నుంచి క్షీరాభిషేకం, స్వామివారి నిజరూప దర్శనం జరిగింది. వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించారు. నగరంలోని పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గల పంచముఖ ఆంజనేయునికి క్షీరాభిషేకం నిర్వహించారు. పాలకొండరోడ్డులో గల కోదండరామస్వామి దేవాలయంలోని శ్రీరామ్‌భక్త హనుమాన్‌కి హనుమాన్ జయంతి సందర్భంగా ఆ ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. గుజరాతిపేటలో గల జగన్నాథస్వామి ఆలయంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. తమలపాకులు, నిమ్మకాయల దండలతో స్వామివారికి అలంకరణ చేశారు. సత్యసాయిబాబా పెద్దమందిరంలో హనుమజ్జయంతి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గారెలతో స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: మొండేటివీధిలో ఆంజనేయస్వామికి సహస్ర కమల అర్చన దృశ్యం



శ్రీకాకుళం అర్బన్: పంచముఖ ఆంజనేయునికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బన్: కోదండరామస్వామి ఆలయంలో రామ్‌భక్త హనుమాన్‌కి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బన్: గుజరాతిపేటలోని ఆంజనేయునికి నిమ్మకాయలు, తమలపాకులతో దండలు వేసిన దృశ్యం

చదవడం రావాలి

శ్రీకాకుళం అర్బన్: చిన్నతనం నుంచే క్షుణ్ణంగా చదవడం, రాయడం రావాలని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. బలగ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం హిందూ, పలు ఇంగ్లిష్ పేపర్‌లను చిన్నారులతో చదివించడం జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రసేను మాట్లాడుతూ మాతృభాషతోపాటు జాతీయ, అంతర్జాతీయ భాషలైన హిందీ, ఇంగ్లిష్ కూడా నేర్చుకోవడం ఎంతో ముఖ్యం అని పేర్కొన్నారు. అనంతరం పిల్లలకు లెమన్ స్పూన్, చైర్‌గేమ్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు.

పురాణాల్లోని నీతిని గ్రహించాలి..

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులకు మన పురాణాలు, ఇతిహాసాలపై అవగాహన ఉండాలని ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయురాలు టి.ఎర్రమ్మ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరము ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. రామాయణ, మహాభారత ఇతిహాసాలు, చందమామ, బాలభారత కథలు తదితరవి తెలుసుకుని అందులోని నీతిని గ్రహించాలన్నారు. ఉపాధ్యాయుడు పి.ఈశ్వరరావు, పి.భానుమతి, గణేష్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. ఇందులో భాగంగా విద్యార్థులకు పూర్వపు రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కాలాం జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెండ సత్యనారాయణ, గ్రంథాలయ అధికారి ఎం.నీలమ్మ పాల్గొన్నారు.

లావేరు: విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని లావేరు శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మురపాక, లావేరు శాఖాగ్రంథాలయాల్లో సెల్‌ఫోన్లు, టీవీలు ఎక్కువగా చూడటం వలన కలిగే నష్టాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, పి.షణ్ముఖరావు, రిసోర్సుపర్సన్లు పి.రాందేవ్, ఐ.జాహ్నవి పాల్గొన్నారు.



రణస్థలం: దినపత్రికలు చదువుతున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: మానవుడికి ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను అందించేందుకు చెట్లను ఎక్కువగా పెంచాలని ఉపాధ్యాయుడు పీవీ రమణ అన్నారు. ధర్మవరం గ్రంథ్రాలయంలో పరిసరాల పరిశుభ్రత, ప్రాణవాయువు అనే అంశంపై విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఆక్సిజన్, హైడ్రోజన్ కలిస్తే నీరుగా మారుతుందని వివరించారు. ఆక్సిజన్ గాలిలో ఎక్కువగా ఉంటే చల్లగా ఉంటుందని అందువలన పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం మాతృదినోత్సవాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులతో పిల్లలకు దీవెనలు అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖరరావు, సహాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రణస్థలం: వార్త పత్రికలు చదవటం వలన ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుస్తుందని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు దినపత్రికలు చదవటం, వ్యాస రచనలు, చిత్ర లేఖనం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కె.భాస్కరరావు, విశ్రాంతి ఉద్యోగి ఆర్.ధర్మారావు, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక స్వావలంబన అవసరం



స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అంధవరపు ప్రసాద్, తదితరులు

శ్రీకాకుళం అర్బన్: మహిళలకు ఆర్థిక స్వావలంబన అవసరమని వైఎస్సార్‌సీపీ నాయకులు అంధవరపు ప్రసాద్ అన్నారు. భగవాన్ సత్య సాయి బాబా వారి దివ్య ఆశీస్సులతో ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని సత్య సాయి సేవా సమితి పెద్ద మందిరంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉచిత కుట్టు శిక్షణ ద్వారా నిరుపేద మహిళలకు స్వయం ఉపాధి కలుగుతుందన్నారు. పూర్వపు జిల్లా అధ్యక్షుడు, రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షుడు రమణ బాబు మాట్లాడుతూ ఇప్పటికి జిల్లాలో సుమారు 1200 మంది గ్రామీణ మహిళలకు కుట్టు శిక్షణ, మగ్గం వర్క్ ద్వారా ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. శ్రీకాకుళం సత్య సాయి సేవా సంస్థల జిల్లా కో ఆర్డినేటర్ సూర రామచంద్రరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, పెద్ద మందిరం కన్వీనర్ కంబ మురళీకృష్ణ, బాలవికాస్ గురువులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బుడగుట్లపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సమక్షంలో కార్యక్రమం జరగనుంది.

రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం

- సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్: వేసవిలో రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేశామని సీఐ లెంక సన్యాసినాయుడు ఆదివారం పేర్కొన్నారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు శనివారం అర్ధ రాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు నగరంలోని పలు ఏటీఎం సెంటర్లు, షాపింగ్ మాళ్లు, దేవాలయ ప్రాంతాలే కాకుండా సర్కిల్ పరిధి గ్రామీణ ప్రాంతాల్లో తమ బృందాలతో కలిసి తిరిగామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తమ సిబ్బందితో ఆటో మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రజలకు అవగాహన పరుస్తున్నామన్నారు. పట్టణంలో ఎవరైనా రాత్రి వేళల్లో కారణం లేకుండా 12 గంటల తర్వాత కనిపిస్తే వారిని ఆపి తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.

పాపిలాన్ పరికరం ద్వారా వారి ఫింగర్ ప్రింట్ తీసుకుని గతంలో వారికి నేర చరిత్ర ఉన్నది, లేనిది తెలుసుకుని విడిచిపెడుతున్నామన్నారు. సెకెండ్ షో సినిమాలకు వెళ్లేవారి వద్ద వారు టికెట్టు చూపించినా.. కొందరు అనుమానాస్పదంగా కనిపిస్తే స్టేషన్‌కు తీసుకెళ్లి వారు నిజంగా సినిమాకు వెళ్లారా లేదా అన్నది నిర్ధారించుకున్నాక విడిచిపెడుతున్నామన్నారు. విశాఖ–బి కాలనీ సమీపంలోని ఇందిరా కాలనీ వద్ద అర్ధరాత్రి దాటాక అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు యువకులను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించామని, ఫింగర్ ప్రింట్ తీసుకుని, వారి వివరాలు తీసుకుని విడిచిపెట్టామని సీఐ చెప్పారు.



ఇందిరానగర్‌లో యువకుల వివరాలు సేకరిస్తున్న సీఐ లెంక సన్యాసినాయుడు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. జాతీయ రహదారిపై వాహన చోదకులకు ఆదివారం ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు చేశారు. గుడ్ మార్నింగ్ మేడమ్, గుడ్ మార్నింగ్ సార్ అంటూ ఫ్రెండ్లీ పోలీస్ విధానంలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. పోలీస్‌ల కోసం నిబంధనలు పాటించవద్దని, ప్రాణం విలువ, కుటుంబ సభ్యుల భవిష్యత్తు కోసం నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాలకు కారణం హెల్మెట్ పెట్టుకోక పోవటం, ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవటం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం, పరిమితికి మించిన వేగంతో వెళ్లడం కారణంగా చెప్పారు. రోడ్డు ప్రమాదాలకు అవకాశం లేని డ్రైవింగ్ చేయాలని, ప్రాణాలు విలువ తెలుసుకోవాలని సూచించారు.



ద్విచక్ర వాహనంపై ఎక్కువ మందితో వెళ్తున్న వ్యక్తికి సూచనలు ఇస్తున్న ఎస్సై సత్యనారాయణ

ఘనంగా మాతృదినోత్సవం



అరసవల్లి: తల్లులకు పండ్లు పంపిణీ చేస్తున్న కిమ్స్ వైద్యులు

శ్రీకాకుళం: అమృతం కంటే అమ్మ ప్రేమ గొప్పదని, తల్లిని మించిన దైవం లేదని శ్రీకాకుళం రిమ్స్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రిమ్స్ ఆస్పత్రిలో ప్రసూతి వార్డులో ఆదివారం బాలింతలు, రోగులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సేవలను కొనియాడారు. మదర్ థెరిసా అవార్డు గ్రహీత జి.ఇందిరాప్రసాద్, మనవతా సంస్థ సభ్యుడు, రిటైర్డ్ డీఎస్పీ కె.భార్గవనాయుడు, జామి భీమ శంకర్, ఎస్.జోగినాయుడు, వై.మురళి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం: రిమ్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆర్ఎంఓ ప్రసన్నకుమార్

అరసవల్లి: నగరంలో కిమ్స్ ఆస్పత్రిలో మాతృదినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఆస్పత్రిలో ఉన్న తల్లులకు పౌష్టికాహారాన్ని, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్త్రీ ప్రసూతి వైద్యురాలు పేడాడ లాస్య మాట్లాడుతూ ప్రసవానంతరం తల్లులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో కొంగరాం గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులను అభినందించి బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ప్రత్యేక భజన కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా మండలి జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, జిల్లా సేవాదల్ కోఆర్డినేటర్ సూర రామచంద్రరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండ రవి పాల్గొన్నారు.



బహుమతులతో విద్యార్థులు